సమయం మించిపోయింది

శ్రీ వాసమూర్తి

అతనామెను పెళ్ళిచేసుకోవలసింది కాదు. అయినా పెళ్ళిచేసుకున్నాడు. పెళ్ళి చేసుకున్నాడంటే తనంతట తనే ఎంచి, చూసి చేసుకున్నాడని కాదు. అటువంటిది ఈ సమాజంలో అసాధారణమైన విషయం. సంబంధం నిశ్చయించడం, మూడుముళ్ళూ వేయించడం తల్లిదండ్రులపని. తల్లిదండ్రులు చెప్పినట్లు ఒప్పుకొని, చేసినదానికి సంతోషించడమే సుపుత్రుల పని. అలాగే ఆమెను చేసుకొని సుపుత్రుణ్ణనిపించుకున్నాడు రావు.

ఆమె అందకత్తె అని చెప్పి ఊరుకుంటే అపచారమే కాగలదు—గులాబి ఒక పూవు అని చెప్పి ఊరుకున్నట్లు. ఆమె పేరుచెప్పి, ఆ పేరుకు అర్థం చెపితే చాలు తక్కినది పాఠకులే ఊహించుకోగలుగుతారు. ఆమె పేరు హేమలత. అంటే బంగారు తీగ అని. నిజంగా బంగారమే కాచి పోతపోశారా అన్నట్లుండే శరీర మామెది. అయినా ముట్టుకుంటే కంది పోతుందేమో నన్నంత సుకుమారి కూడా. ఆమె రూపవతీ, విద్యావతీ మాత్రమే కాకుండా ఒక జమీందారు గారాబు బిడ్డ కూడాను.

అతను అంత వికృతాకారి కాదుకాని, అందగాళ్ళ కుండవలసిన తీర్చిదిద్దిన రూపురేఖలేమీ లేవతనికి. నాలుగుసార్లు చూసినా జ్ఞాపకం రానంతటి సామాన్యమైన ముఖ మాతనిది. పైపెచ్చు కొద్దినలుపు కూడాను. అటువంటివాడు, అంతటి రూపవతినీ, జమీందారు బిడ్డనీ వివాహమాడడం ఎలా తటస్థించిందా అన్న ప్రశ్న రావచ్చు. అతని అందచందాలు చూచికాదు జమీందారు తన పిల్లనిచ్చినది. ఆనాడు రావుతండ్రి నగరంలోకెల్లా పెద్ద ధనవంతుడు. అందువల్లే ఆయన జమీందారుతో వియ్యమంద గలిగాడు. వధూవరులకు పరస్పరం అందచందాలు ఎంచుకోవడానికి గానీ, తమ భావిజీవితం గురించి ఆలోచించుకోవడానికిగానీ అవకాశంలేని చిన్నతనపు రోజులవి. పెళ్ళి అంటే బాజాలు వస్తాయి; చుట్టాలు వస్తారు; పల్లకీ ఎక్కి ఊరేగవచ్చు, కొత్త బట్టలు కట్టుకోవచ్చు; బహుమతులు పొందవచ్చుననే తప్ప మరొకటి తెలియదప్పుడు.

నిర్ణయాలు చేసేది ఒకరూ, ఆ నిర్ణయాల ఫలితాలు అనుభవించేది ఇంకొకరూ. పోనీ ఆ నిర్ణయాలు చేసేవారు తమ నిర్ణయాలు సరియైనవే అనేటట్లు చేయగలిగితే బాగానే ఉంటుంది. కాని అటువంటి బాధ్యత వహించడానికి అవకాశమే లేకుండా పోవడం చాలా దురదృష్టకరం. అటువంటిదే జరిగింది రావు విషయంలో. అతని భార్య ఇక కొన్నాళ్ళకు కాపురానికి వస్తుందనగా ఒకరోజున అతని తండ్రి గదిలో చచ్చిపడిఉన్నాడు. అకస్మాత్తుగా గుండె ఆగి చనిపోయాడేమో ననుకున్నారందరూ. కాని విచారించగా తెలిసింది విషం త్రాగి చనిపోయాడని. నగరంలోకెల్లా పెద్ద ధనవంతుడు విషం త్రాగి చనిపోవడమే! వెలుతురు వేగంతో వ్యాపించిందీవార్త ఊరంతా. రహస్యమంతా—బండారమంటే ఇంకా బాగుంటుందేమో!—బయటపడింది. బ్రహ్మాండం బ్రద్దలైనట్లయింది రావుకి. అతని తండ్రి మొదటినుంచీ ధనవంతుడుకాడు. తోలుదొల్ల షావుకారు గుమాస్తాగా ప్రారంభించాడు జీవితం. చాలా కాలం గుమాస్తాగానే ఉన్నాడు. కాని కష్టించి ఎలాగో కొంత కూడబెట్టాడు. వ్యాపార రహస్యాలు తెలుసుకున్నాడు. సొంత వ్యాపారం పెట్టాడు. లక్ష్మి కటాక్షించింది. అంతే చరచరా పైకిపోయి ఆకాశమందుకున్నాడు. ఒక వెలుగు వెలగసాగాడు. అతనికీ ధనవంతులకందరికీ ఉండవలసిన లక్షణాలన్నీ సహజంగా వచ్చివేశాయి. ఎంతఉన్నా, ఉన్నదానితో తృప్తిపడక ఇంకా ఎక్కువ ధనం సంపాదించడానికే నిరంతరం ప్రయత్నించసాగాడు. కొన్ని ఆశల నాధారంచేసుకొని కొన్ని పథకాలు వేశాడు. కాని తీరా వేసింది పప్పులోకాలని తేలింది. ఆశలు నిరాశలై, పథకాలు నిష్ఫలమై, అప్పులు తలకు మించిపోగా, తనతోబాటు ఎందరినో ముంచుతూ, అతిసులభమైనపని—ఆత్మహత్య—చేసు

కున్నాడాయన. ఒక్కసారిగా తమనందరినీ మించిపోయి ఆకాశానికి ఎగిరిన తారాజువ్వ తిరిగి నేల కూలేసరికి ఇన్నాళ్ళూ ఈర్ష్యతో కుమిలిపోయిన హృదయాలన్నీ సంతోషంతో పొంగిపోయాయి. వేల నాలుకలు వేలవిధాలుగా చెప్పుకో సాగాయి. నడమంత్రపు సిరి నట్టేట ముంచక మరేమి చేస్తుందన్నారు ప్రబుద్ధులు చాలామంది. రావు తండ్రి పోయినచోటికే పోయింది కొన్నాళ్ళకు తల్లికూడా. ఈ ప్రళయంనుంచి బయటపడేసరికి రావుకు మిగిలింది కట్టుబట్టలూ, ఊళ్ళో తండ్రినిగురించి లక్ష నిందలూ. కంగారుగా ఉద్యోగంకోసం ప్రయత్నించ సాగాడు రావు. ఉద్యోగమెందుకు, మాయింటికివచ్చి ఉండమన్నారు మామగారు. కాని రావు అందుకు అంగీకరించలేదు. తనకాళ్లమీదే తను నిలబడాలి అని నిశ్చయించుకున్నాడు. పట్టుదలతో ఉద్యోగ ప్రయత్నం సాగించాడు. కాని ఉద్యోగంకోసం ఎలా ప్రయత్నించాలో తెలియక కొంతకాలం బాధపడ్డాడు. ఎలా చేయాలో తెలిసి కొంతకాలం బాధపడ్డాడు. ఆఖరికి ఎలాగో అలాగ, మామగారి పలుకుబడిమీదా, తండ్రిపేరువల్ల ఒక ఉద్యోగం సంపాదించగలిగాడు. నెలకు నూటఏభైరూపాయిల జీతం. ఇప్పటి పరిస్థితుల్నిబట్టి అది కొత్తవాడికి పెద్దజీతమే!

భార్యకోసం అత్తవారింటికి వెళ్లాడు. మొదటి రాత్రే ప్రారంభమయింది సంఘర్షణ. సిగ్గేమో అనుకున్నాడు మొదట. కాని రెండోరాత్రీ, మూడోరాత్రీకూడా ఎంత ప్రయత్నించినా, ఎన్నివిధాల ప్రాధేయపడినా ఆమె పెడమొగంగానే ఉండేసరికి రావు కళ్లు తెరిచాడు. అతనిగుండె దిగజారిపోయింది. ఇన్నాళ్ళూ ఆమె తనభార్య అనితప్ప ఆమెకూ కొన్నిభావా లుండవచ్చునని ఊహించలేకపోయాడు. ఆమె భావాలు తనభావాలకు వ్యతిరేకమేమోనని అనుమానించి దిగ్భ్రాంతుడై పోయాడు. ఏమీ తోచలేదు. యువకుడూ, అనుభవ శూన్యుడు. ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో, ఎలా తీర్చి దిద్దుకోవాలో అతనికి అర్థం కాలేదు.

అటు ఆమెలో సౌందర్యం వికసించడంతో బాటు తన కనుపమసౌందర్యముందనే జ్ఞానంకూడా వికసించింది. ఆమె సౌందర్యం ప్రతిసౌందర్యాన్ని కోరింది. అతనిలో ఆ సౌందర్యఛాయకూడా లేదు. అందువల్ల అతనికోసం ఆమె హృదయం వికసించలేకపోయింది. అదేకాక ఆమె శ్రీమంతులబిడ్డ. కొన్ని స్వేచ్ఛలకూ, ఒకవిధమైన జీవితానికీ అలవాటు పడి ఉంది. అటువంటిది తానలవడ్డ జీవితానికి పూర్తిగా భిన్నమైన జీవితం గడపబోయే ఒక 'ఎకౌంటంటు' తనకు భర్త అని గ్రహించి ఆమె హృదయం మరీ ముకుళించుకుపోయింది. ఆమె మనశ్శరీరాలు రెండూ కూడా అతనికి ఎదురుతిరిగాయి. అతనిస్పర్శ ఆమెకు జెర్రులు ప్రాకిన ట్లుంటోంది.

ఆచారం ప్రకారం మూడురోజులైనతరువాత ఆమెను ఇంటికితీసుకువచ్చాడు రావు, ఎలాగో మెల్లగా అనునయించగలన నే ఆశతో. భార్యను కష్టపెట్టకుండాఉండడానికి దాసీమనిషితోబాటు, తనతాహతుకుమించినా ఒకవంట మనిషినికూడా పెట్టాడు. ఆ చిన్ననాలుగుగదుల భాగాన్నే ఎన్నోవిధాల అలంకరించాడు. అయినా ఆమెను ప్రసన్నురాలుగా చేసుకోలేకపోయాడు. సకల సౌకర్యాలతో అలరారే పెద్ద భవనాలలో స్వేచ్ఛగా సంచరించడానికి అలవడ్డ ఆమె ఆ చిన్న భాగంలో పంజరంలోని పిట్టలా బాధపడసాగింది. వీలైనప్పుడల్లా నగరంలో స్నేహితులూ, బంధువుల యిండ్లకూ పోయివస్తోంది. ఇంటిదగ్గర ఉన్నంతకాలమూ కిటికీదగ్గరే ఆకాశంకేసి చూస్తూ కూర్చుంటోంది. భర్త ఎదురుపడితే అసహ్యంతో ముడుచుకుపోయి ప్రక్కకు తప్పుకుంటోంది. ఆమె తప్పుకుతిరగడం చూచి రావు ఎంతో బాధపడుతున్నాడు. ఎందువల్ల ఆమె తనపట్ల ప్రేమ చూపలేకపోతోంది? తానందకాడు కాదనే! అవును, తానందగాడు కాడు. తానే అందగాడై, ఆమెయే కురూపిణియైయుంటే తనూ ఆమె ఇప్పుడు ప్రవర్తించినట్లే ప్రవర్తించి ఉండేవాడేమో! ఆమె అంత అందంగా ఉంది కాబట్టే తనకీ ఆరాటం, ఈ బాధ. కాని ఆ అందం అనుభవించే దెలా? తనూ అందంగా ఉంటేనేనా ఆ అర్హత? కాని తన కందం ఎలా వస్తుంది. ఆడవాళ్లుపయోగించే సౌందర్యోపకరణాలు కూడా కొన్ని ఉపయోగించి తంటాలుపడినా లేని అందం తెచ్చుకోలేకపోతున్నాడు. ఎన్నోమార్లు నిలువుటద్దం ముందు నిలబడి రకరకాలుగా 'పోజు'లు పెట్టి, కళ్లు తిప్పి, కనుబొమలాడించి చూసుకున్నా తానందగాడనని సంతృప్తి పొందలేకపోతున్నాడు. హఠాత్తుగా ఏ సైంటిస్టో నల్లశరీరాన్ని తెల్ల శరీరంగా మార్చే మందు కనుగొంటే ఎంత బాగుంటుంది! ఇండియాలోకూడా 'ప్లాస్టిక్ సర్జన్లు' బయలుదేరి 'ప్లాస్టిక్ సర్జరీ' చౌక అయిపోతే ఎంత బాగుంటుంది! అవును, బాగుంటుంది. కాని జరగదు, అంతే! అందువల తానిప్పటిలో అందగాడు కావడమనేది కల్ల. అంతేనా!

తానిలా ఉండిపోవలసిందేనా? లోకంలో ఎంతమంది అనాకారులకు అందమైన భార్యలు లేరూ. వాళ్ళు సుఖంగా జీవితాలు గడుపుతున్నారే. అందగాళ్ళైన భర్తలు కూడా కురూపిణులైన భార్యలతో సుఖంగానే సంసారయాత్ర సాగిస్తున్నారే. తన భార్య కూడా కురూపి అయిఉన్నా, భార్య కాబట్టి ఆమెతో జీవితం గడపేవాడే.

ఆమె హృదయంలో స్థానం సంపాదించడమెలా? రహస్యంగా ఎన్నో కామశాస్త్ర గ్రంథాలు తెప్పించుకొని స్త్రీలు ఏమి కోరేదీ, వారిని ఎలా సంతృప్తిపరచవలసిందీ, వారి నెలా వశపరచుకోవలసిందీ మొదలైన విషయాలు శ్రద్ధగా పెక్కుసార్లు చదివాడు. ప్రతిగ్రంథకర్తా ఏవో కొన్ని సలహాలు— ఒక్కొక్కప్పుడు పరస్పర విరుద్ధమైనవి కూడా— ఇస్తూనే ఉన్నాడు. ఆ సలహాలన్నిటి వెనక అశేషమైన అనుభవజ్ఞాన ముందని చెప్పబడుతోంది. అన్ని సలహాలు చదివి అందులో దేనిని అవలంబించాలో తెలయక, మళ్ళీ మొదటికే వచ్చాడు రావు. స్నేహితుల్ని అడగడానికి సిగ్గు. అయినా ఎలాగో సాహసించి, తనకు సంబంధించనట్లుగా ఒకరిద్దరు స్నేహితుల్ని అడిగి తెలుసుకున్నాడు. వాళ్లూ రోజూ సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు మల్లెపూలు వగైరాలు పట్టుకువెళ్ళాలనీ, అప్పుడప్పుడు మంచి మంచి చీరలూ, జాకెట్లూ కొని తీసుకువెళ్లాలనీ, సినిమాలకు కూడా బెట్టుకుపోవాలనీ సలహాలిచ్చారు. అలాగే మల్లెపూలూ, గులాబీపూలూ వగైరాలు కొని పట్టుకు వెళ్తున్నాడు. కాని ఆమె ఎన్నడూ వాటిని పెట్టుకొన్న పాపాన పోలేదు. తన జీతంబట్టి కష్టమనిపించినా ఎలాగో ఎక్కువ ఖర్చుపెట్టి ఒక మంచి సిల్కుచీరకొని పాకెట్టుగా ఇంటికి తీసుకువచ్చాడు. పాకెట్టు పాకెట్టుగానే ఉండిపోయింది. తనే పాకెట్టువిప్పి చీర దండెంమీద వేశాడు, ఆమె దృష్టిన పడుతుందనే ఉద్దేశ్యంతో. ఆ చీర దండెంమీదే ఉండిపోయింది. ఆమె తనతో సినిమాకు రావడమనేది అసంభవం.

అది, కాదయ్యా, స్త్రీకి ప్రార్థించబడడమంటే, తన పొగడ్తలు వినడమంటే ఎంతో సరదా. కాబట్టి మనము మన హృదయ మామెకే అర్పించివేస్తున్నామని చెప్పి, ఆమె సౌందర్యాన్ని పొగడుతూ ఆమె కటాక్షించకపోతే నిరాశతో కృశించి నశించిపోతామని చెప్పినప్పుడే ఆమె గుండె కరగుతుంది, అని ఒకడు సలహాయిచ్చాడు. రావుకు ఈ సలహా చాలా నచ్చింది. ఎంతటి రాతిగుండెనైనా కరగించే ఎన్నో వాక్యాలు ఊహించి, సమకూర్చుకొని చిన్న ఉపన్యాసంగా మార్చుకొని పదేపదే వల్లెవేసి సమయం కోసం చూస్తున్నాడు. సాయంత్రం ఆమె యథావిధిగా కిటికీదగ్గరే కూర్చుని ఆకాశంవైపుకు చూస్తోంది. మెల్లగా చప్పుడుకాకుండా ఆమె దగ్గరకు చేరాడు. ఆమె అతనిరాక గమనించలేదు. అతను ఆమె పాదాల దగ్గర కూర్చున్నాడు. ఆ పాదాలు ఎంత తెల్లగా, ఎంత చిన్నవిగా, ఎంత సుకుమారంగా ఉన్నాయో! పూజచేయదగిన పాదాలవి! ఆ పాదాల మీదనుంచి పైకి సారించాడు దృష్టి. 'హేమా' అన్నాడు ఒక్కసారిగా ఆనందంలో తన్ను తాను మరచిపోయి. ఆమె ఉలిక్కిపడింది. అతన్ని చూసింది. లేచి పోబోయింది. "హేమా, హేమా, నామీద నీకు జాలి కలగదా" అంటూ ఆమె కదలకుండా ఆమె కాళ్లకు చుట్టవేసుకున్నాడు.

ఆ సమయంలో తా నెంతగానో కష్టపడి సిద్ధంచేసుకున్న వాక్యా లేవీ అతని నోటివెంబడి రాలేదు. ఆవేగంతో మాటే పెగలడంలేదు. కన్నీటిధార లామె పాదాలు తడుపుతున్నాయి. అయినా అటువంటి ధారలకు నానిపోయే పాదాలు కావవి. ఆమె కాళ్ళు వదిలించుకోవడానికి ప్రయత్నించసాగింది. కాని అతను పట్టువిడవలేదు. ఆమె గింజుకుంటోంది. ఆ గింజుకోవడంలో ఆమె మోకాలు అతని చుబుకానికి గట్టిగా తగిలింది. ఆ దెబ్బతో అతని వాక్ప్రవాహం బయటకు పార్లింది. ఎంతటి రాతిగుండెనైనా కరగించివేసే వాక్యాలు డగ్గుత్తికతో భావోద్రేకంతో చెప్పుతున్నాడు. అయినా ఆమెలో కలిగిన భావాలల్లా విసుగు, ఏవగింపు మాత్రమే. ఎంత ప్రార్థించినా, దేవి గుండె కరగపోయేటప్పటికి లాభం లేక వదులుకున్నాడు రావు.

కాని అతనిలో బయలుదేరిన దాహం తీరే దారిలేక అతనినే దహించివేస్తోంది. కావలసిన వస్తువు దగ్గరలో ఉండికూడా ఆ వస్తువు అతనికి కాకుండాపోతోందంటే భరించలేక పోతున్నాడతను. ఆకలితో మలమల మాడుతున్న మనిషిని రెక్కలువిరిచి చెట్టుకు కట్టివేసి నోటికి అంగుళం ఎడంలో ద్రాక్షపళ్ళ గుత్తి వేళ్ళాడదీస్తే ఎలా ఉంటుందో అలా ఉంది అతనిపని. ఆమె దగ్గరలేకపోతే అంత బాధపడక పోవునేమో, దగ్గర ఉండికూడా దూరమై పోతూండడంవల్ల అతనికి పిచ్చెత్తినట్లుగా ఉంటోంది.

తనలాగే కురూపులుగానుండి అందమైన భార్యలు కలవాళ్లు ఊళ్ళో ఎందరున్నారో జ్ఞాపకం

తెమ్పుకోసాగాడు. చాలామందే ఉన్నారు. కాని వారిలో ఒకాయనతో రావుకు బాగా పరిచయముంది. ఆయన అచ్చు కొండముచ్చులా ఉంటాడు. ఆయన కొకభార్య ఉంది కాకి ముక్కున దొండపండులా. అయినా ఆ భార్యవల్ల సమస్త సుఖాలూ పొందుతున్నాడాయన. ఆయన దగ్గరకు చేరాడు రావు. ఆతృత కొద్దీ తెగించి, హృదయంలోని బాధనంతా సంకోచం లేకుండా ఆయనకు వెల్లడించాడు రావు. ఆయన అత్యంత శ్రద్ధతో విన్నాడు. తరువాత సంతృప్త జీవితం సూచించే చిరునవ్వు నవ్వుతూ ఆయన ఉపదేశం చేశాడు: నాయనా, స్త్రీలూ పురుషులూ సమానమనుకొని ఎన్నడూ భ్రమలో పడకు. స్త్రీ స్త్రీయే పురుషుడు పురుషుడే. పురుషత్వం చూపించితేనే పురుషుడనిపించుకునేది. స్త్రీ కోరేది పురుషునిలో పురుషత్వమే. పురుషత్వమంటే బలమే. పురుషుడైనవాడు తన బలం ప్రయోగించాలి. ఆ బలానికిలొంగడంలోనే స్త్రీకి ఆనందం.

ఈ సలహాలో చాలా నిజముందనిపించింది రావుకి. పశుబలంద్వారా లొంగదీయటానికి ప్రయత్నించాడు. అప్పుడెప్పుడు ఆమెను కొట్టడానికి కూడా వెనుదీయడంలేదు. కాని అటు ఆమెలో ఇప్పుడతనంటే నరనరాల్లో ద్వేషభావం రగులుకుంటోంది. ఇదివరకు అతని కురూపానికి అసహ్యించుకునేది. ఇప్పుడు అతను తన నలా లొంగదీయడానికి ప్రయత్నించటం చూసి అతనంటే పరమద్వేషభావం కలిగింది. ఏదో పురుగును చూసినట్లు చూస్తోంది. అయినా తాను చేస్తున్నది తప్పా, ఒప్పా అని ఆలోచించుకోలేకపోతున్నాడు రావు.

ఒకరోజు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆమె కనబడలేదు. వంటమనిషి నడిగాడు ఎక్కడికి వెళ్ళిందని. తండ్రిగారు వచ్చి తమ ఊరు తీసుకువెళ్ళిపోయారని చెప్పింది. నిర్ఘాంతపోయాడు. వెంటనే అత్తవారింటికి వెళ్లాడు. భార్య కనుపించలేదు. మామగారే కనిపించారు. మామగారిని చూసేసరికి అక్కడికి తాను ఏ ఉద్దేశ్యంతో వచ్చానా అన్న సందేహం కలిగింది. మామగారతనిని అడిగారు: "ఏమిటి నాయనా ఇదేనా నీవు ప్రవర్తించే విధానం! ఇదేనా నీ సభ్యత! ఇలా మారిపోయావా? నీవింకా కుర్రవాడివనేది గమనించి నిన్నేమీ అనలేను. కాని తొందరపడకూడదు రావు. ఎదటివాళ్ళ మనస్తత్వాలు కూడా అర్థంచేసుకొని నడవాలి." ఆ మాటలు వింటూంటే అక్కడికక్కడమాయమైపోతే బాగుండుననిపించింది రావుకి. మామగారు మంచిసలహా ఇచ్చారు అనే భావంపోయి, ఆ సలహా ఇచ్చినందుకు ఆయనమీద ద్వేషం కలిగింది రావుకి. వెంటనే తిరిగి వచ్చేశాడు.

మళ్ళీ మథనలో పడింది వ్యవహారం. ఆమె తిరిగి తనదగ్గరకు వస్తుందా? తనను పూర్తిగా విడిచిపెట్టివేస్తుందేమో? అయోమయస్థితిలో పడి తన్నుకుంటున్నాడు.

అతను తిరిగివచ్చిన కొద్దిరోజులకే మామగారిదగ్గరనుంచి ఉత్తరంవచ్చింది. తాను తండ్రి కాబోతాడనివార్త! ఆనందం పట్టలేక గంతులు వేశాడు గది అంతా. అదీ, ఇక హేమ తనదే! పూర్తిగా తనదే! ఆమె కాదన్నా తనతో విడని సంబంధమేర్పడిపోయింది. ఇక ఆమె విషయంలో ఆదుర్దా చెందనక్కరలేదు. ఇది ఆలోచించుకోగానే హేమమీద మమకారం, ప్రేమ పొంగజొచ్చింది. ఇక ఎప్పుడూ పశుబలంతో ఆమెముందు ప్రవర్తించకూడదు. ఆమె సున్నితహృదయాన్ని గాయపరచకూడదు. ఎలాగైనా ఆమె తనదే. తనపట్ల అనురాగమేర్పడక తప్పదు. కాబట్టి మెల్లగానే ఆమె హృదయం మారేటట్లు చేసుకోవాలి. ఆమె హృదయం తనదిగా చేసుకోవాలి! తమ హృదయాలను ఏకం చేయబోయే ఆశిశువు కొడుకో, కూతురో? తెల్లగా ఉంటుందో తనలాగే నల్లగా ఉంటుందో అన్న దానిమీదకు ఆలోచనలు పోసాగాయి. ఆ పుట్టబోయే బిడ్డకోసం అత్యుత్సాహంతో ఎదురుచూస్తున్నాడు. కాని ఆ ఉత్సాహం కొద్దిరోజులలోనే విరిగిపోవలసి వచ్చింది. ఆమెకు గర్భంపోయింది! అతని ఆశాసౌధాలన్నీ కూలి అతనిమీదే పడ్డాయి. తనలో కొంతకాలం ఆశాకిరణాలు ప్రసరింపజేసిన ఆ పుట్టకముందే చచ్చినబిడ్డకోసం దీనంగా విలపించాడు.

ఆరోగ్యం బాగుపడగానే హేమను తీసుకొని జమీందారుగారు అతనిదగ్గరకు వచ్చారు. ఆ ఉన్న ఇల్లు చాలదనిచెప్పి ఊళ్లో ఇంకొకచోట ప్రత్యేకంగాఉన్న ఒక భవనం ఏర్పాటుచేశాడు కూతురికీ అల్లుడికీ. ఒక కారుకూడా ఇచ్చారాయన. కూతురూ అల్లుడిమధ్య ఉండవలసినవిధంగా లేదని ఆయన గ్రహించాడు. ఆ పరిస్థితికి తనదికూడా కొంతబాధ్యత ఉంది. కాని రావుపరిస్థితి ఇలా అయిపోతుందని ఎన్నడూ ఊహించలేకపోయాడు. తన కూతురు అతనంటే అంత అసహ్యించుకుంటుందనికూడా అనుకో

లేదు. కాని ఇప్పుడు ఆయన చేయగలిగింది ఏముంది? ఉపన్యాసం ఇచ్చి బోధచేసి ఆమె హృదయంలో అతని మీద ప్రేమకలిగేటట్లు చేయడం అసంభవం. అది హృదయంలోనుంచే రావాలి. ఆయన చేయగలిగిందల్లా పరిస్థితి మరింత దిగజారడానికి తోడ్పడే చర్యలు తీసుకోకపోవడమే. అందువల్లే ఆయన వాళ్ళ వ్యవహారంలో జోక్యం కలిగించుకోవడం లేదు.

మళ్ళీ అనునయధోరణే అవలంబించాడు రావు. ఏదోవిధంగా ఆమెను పలకరించాలని ప్రయత్నం చేస్తున్నాడు ఆమె ఏ పనైనా చేయబోతూంటే అడ్డుపడి తనే చేసిపెట్టున్నాడు. అయినా కృతజ్ఞతా భావం పొడసూపడం లేదామెలో. విదిలించుకొని వెళ్ళిపోతోంది ఆమె అతనిదగ్గరనుంచి. తానిదివరకు ఆమెనలా హింసించినందుకు ఆమె సున్నిత హృదయం గాయపడిందేమో ననుకున్నాడు. ఆగాయం మానాలి. ఒకసారి క్షమార్పణ కోరుకోవాలి. తాను క్షమార్పణ కోరితే ఆమె కొంత మెత్తబడవచ్చు. కాని అతను క్షమార్పణ కోరుకోడానికి అవకాశమే కలగడం లేదు. ఆమె ఇదివరకులా లేదు. ఎంతో మార్పు వచ్చింది ఆమెలో. ఇంటిదగ్గరే ఉండడంలేదు. స్వేచ్ఛగా కారులో ఎక్కడకు పడితే అక్కడకు తిరిగివస్తోంది. పార్టీలకు పోతోంది. స్నేహితులతో కలసి సినిమాలకు పోయి ఆలస్యంగా వస్తోంది. సమాజంలో ప్రముఖ పాత్ర వహించసాగింది. ఆమెరూపం, తెలివితేటలూ చూసి ఎందరో యువకులూ, యువతులూ ఆమె చుట్టూ మూగసాగారు. ఆమె ఒకటి రెండు సంఘాలకు అధ్యక్షురాలయిందికూడా.

తన ఇంటికి రాకపోక లెక్కువయ్యాయి. ఇల్లు ఒక క్లబ్బుగా మారింది. ఎందరో ఆడవాళ్లూ, మగవాళ్ళూ వస్తున్నారు. కాఫీలు త్రాగుతున్నారు. కబుర్లూ కాలక్షేపాలూ జరిగిపోతున్నాయి. ఆ వచ్చే మగవాళ్లలో ముఖ్యంగా ఒక డాక్టరూ, ఇద్దరు లెక్చరర్లూ, ఒక పొడుగు వెంట్రుకల కళాకారుడూ, నలుగురు ప్లీడర్లూ తరుచూ వస్తున్నారు. వాళ్ళంతా ఎంత చక్కగా కబుర్లు చెప్పుకుంటున్నారు! ఎందుకో అంతగా నవ్వుకుంటున్నారు. వాళ్ల సంభాషణల కంతే లేనట్లుంది. అన్ని విషయాలు వాళ్లకెక్కడ నుంచి వస్తాయో! వారిమధ్య తీవ్రమైన చర్చలు కూడా జరుగుతూ ఉంటాయి. తన భార్య కూడా వాళ్ళతో ఎంతో ఉల్లాసంగా మాట్లాడుతుంది! తన ఇంటిలో తానొక్కడే పరాయివాడయినట్లుగా ఉంది. వాళ్ళ నవ్వులు వింటూంటే అతని గుండెలు బ్రద్దలవుతున్నట్లనిపిస్తోంది. తానుమాత్రం వాళ్ళతో చేరి వాళ్లలా ఎందుకు కబుర్లు చెప్పకూడదు? వాళ్లలో ఎందుకు కలసి మెలసి ఉండకూడదు? తను కూడా వాళ్ళతో స్నేహం చేసి, సమాజంలో పాల్గొంటూ ఉండడంవల్ల తన భార్య స్నేహం సంపాదించవచ్చు ననుకున్నాడు. ఒకరోజున హాలులో అందరూ కూర్చొనిఉండగా రావు వెళ్ళి డాక్టరు ప్రక్కన కూర్చున్నాడు. నవ్వు లిగిరిపోయాయి. అంతా నిశ్శబ్దం అయిపోయింది. అందరి దృష్టి అతనిమీదే పడింది. ఎవరీ వింతపశువన్నట్లు తెల్లబోయి చూస్తున్నారంతా. తన భార్య చూపులో అక్కడ తానుండడం అతిదుర్భరంగా ఉందనే భావం గ్రహించేసరికి అతని గుండె పట్టుతప్పిపోసాగింది. అయినా వాళ్ళను పలకరించి మాట్లాడేటట్లు చేస్తే పరిస్థితి చక్కబడవచ్చుననే ఉద్దేశ్యంతో ఒకరిద్దరి క్షేమాదు లడిగాడు. వాళ్లు సగం సగం సమాధానాలు, వినిపించీ వినిపించకుండా చెప్పి ఊరుకున్నారు. అతను రెండు చెణుకులు విసిరాడు. ఎవరూ నవ్వలేదు. జేబు రుమాళ్ళతో మొగాలు తుడుచుకొంటున్నా రందరూ. ఆ వాతావరణంచూస్తే తానేదో అసభ్యంగా మాట్లాడినట్లూ, అది విని వాళ్ళ సభ్యహృదయాలు బాధపడ్డట్లూ ఉంది. ఆ స్తబ్ధ వాతావరణంలో మరి ఉండలేక బయటికి వచ్చివేశాడు.

మళ్ళీ అదే తృష్ణ. ఆమెను ఎలా స్వాధీనం చేసుకోవాలనే ఆవేదన. వస్తువు దూరమై పోతున్నకొలదీ ఆ దుర్లభవస్తువుకోసమే హృదయం మరింత ఆరాటపడుతోంది. అందకపోవడంలోనే ఉందేమో ఆకర్షణ. ఆమె తనమీద ఆధారపడేపరిస్థితి ఎలా వస్తుంది?—ఆమెకు జ్వరం రావాలి. జ్వరంతో కొంతకాలం ఆమె బలహీనమైపోయి కదలలేకుండా పోవాలి. తానామెదగ్గరే ఉంటూ, ఆమెను కంటికి రెప్పలాగా కాపాడుతూ, ఆమెకు పరిచర్య చేయాలి. దానితో ఆమెగుండె కడ్డంగానిలచిన ఇనుపతెరలన్నీ తొలగిపోతాయి. ఆమెగుండె మెల్లమెల్లగా కరిగిపోతుంది. తనదైపోతుంది. ఆమెకు జ్వరం రావాలి, జ్వరం రావాలి అంటూ ధ్యానిస్తున్నాడు. ఆఖరికి వచ్చింది—తనకే—మశూచికం. అంతా అయిపోయిందనుకున్నాడు. కాని ప్రాణానికేమీ మోసం ఉండబోదని డాక్టరు తెలిపాడు. మళ్ళీ కొంచెం ధైర్యం కలిగింది అతనికి. తన దీనపరిస్థితి చూచేనా జాలితో ఆమెగుండె కదులుతుందేమోనని ఆశించాడు. కాని అతనికి నిరాశే అయింది. వార్త తెలియగానే హేమ

తండ్రివచ్చి, అతనిని ఆసుపత్రిలో చేర్పించి, కూతురిని తనవెంట ఇంటికి తీసుకుపోయాడు.

పూర్తిగా నయమైనతర్వాత ఆసుపత్రినుంచి బయటపడ్డాడు ఒళ్లంతా చిన్నిచిన్ని గోతులతో. తనరూపంచూసుకొని తనే అసహ్యించుకొనే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు అతనిలో తరగని ద్వేషమే విజృంభిస్తోంది. తనను పుట్టించి, తనకింత అన్యాయం చేసిన దేవునిపట్ల, సమాజంపట్ల, హేమపట్ల, ఆమె తల్లిదండ్రులపట్ల, చనిపోయిన తన తల్లిదండ్రులపట్ల, అందరిపట్ల మానవజాతిపట్లే అతనికి ద్వేషం పొంగిపోతోంది. అందరికీ తగిన ప్రతీకారం చేయాలనే తీవ్రకాంక్ష బయలుదేరింది అతని హృదయంలో.

కూతురిని పంపారు జమీందారుగారు. మళ్లా యథాప్రకారంగా జీవితం సాగుతోంది. కాని ఇప్పుడాతను ఆమె కటాక్షం సంపాదించడానికి ప్రయత్నం చేయడంలేదు. తనూ తప్పుకునే తిరుగుతున్నాడు. ఎవరిదారిన వారే నడుస్తున్నారు. రావు గుండెలో ప్రతీకారవాంఛే ప్రబలంగా విజృంభిస్తోంది. ఆమెను ఏడ్పేటట్లు, బాధపడేటట్లు చేయాలని కోరికగాఉంది. తన సంసారంగురించే లోకంలో చెప్పుకుంటున్నట్లు తెలిసిందతనికి. తన వెన్ను వెనకాలే ఏదో చెప్పుకుంటున్నారు. అతను ఎదురు తిరిగితే ఏమీ ఎరగనట్లు నటిస్తున్నారు. ఏవో గుసగుసలు విన్నాడు. అతన్ని అనుమానం బాధించసాగింది. ఎవరు? వాళ్ళలో ఎవరైఉంటాడు? ఇంగ్లీషు లెక్చరరా—పద్యాలు బాగా రాస్తాడు. భావగీతాలాలాపిస్తాడు. హిస్టరీ లెక్చరరా?—ధారాళంగా ఉపన్యాసాలిస్తాడు అతను. పొడుగు వెంట్రుకల కళాకారుడా?—అతను చిత్రించిన సీతా, దమయంతీ, నూర్జహాను మొదలైనవాళ్లంతా తన భార్య అవతారాలేనని తట్టింది రావుకు. అతను వేసిన ఒక నగ్నరూపం—మొగం తెలియడంలేదు కాని-తన భార్యరూపానికి పోలిక ఉందేమోనని బాధపడుతున్నాడు రావు. లేక డాక్టరా?—అందరిలోకీ అందగాడు కాని అంతగా మాట్లాడలేదు. చలనంలేని బొమ్మలా ఉంటాడు. లేక ప్లీడర్లలో ఎవరేనానా? వాడెవడో కనుక్కొని వాడిని నాశనంచేయాలనుకున్నాడు. కాని తెలిసేదెలా? దానితో అందరినీ సమానంగా బురదలో కీడ్చి వేయాలి—సమయంకోసం చూస్తున్నాడు.

ఆవేళ మధ్యాహ్నం రావు ఆఫీసునుంచి త్వరగా ఇంటికి వచ్చాడు. ఇంట్లో హాలులో ఇంగ్లీషు లెక్చరరూ; తన భార్యా దగ్గర దగ్గరగా కుర్చీలలో కూర్చొని ఏదో చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. రావు చరచరా లోపలికి వచ్చివేశాడు. అతనిని చూసి ఇద్దరూ ఉలిక్కిపడి, తెల్లబోతూ నిలుచున్నారు. రావు ఒక క్షణం అలాగే నిలబడిపోయాడు. మళ్ళీ తీక్షణంగా చూస్తూ ఇంగ్లీషు లెక్చరర్ వైపు నడిచాడు. ఇంగ్లీషు లెక్చరర్ భయంతో గజగజ వణికిపోతున్నాడు. "బయటికి పో" అని రంకెవేశాడు రావు. లెక్చరర్‌కు బోధపడలేనట్లుంది. అలానే గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. "బయటికి పో" అని మళ్ళీ రంకెవేశాడు రావు ఇంకా ఉగ్రరగా. లెక్చరర్ సగం తెలుస్తున్నట్లుగా "ఆఁ!" అన్నాడు. "బయటికి నడుస్తావా, లేక మెడబెట్టి గెంటివేయనా" అంటూ అడుగులు ముందుకు వేశాడు రావు. లెక్చరర్ రెండడుగులు వెనక్కి వేశాడు. ఇంతలో అప్పుడే వీధిలోనుంచి డాక్టరూ, ప్లీడర్లూ మిగిలినవాళ్లంతా లోపలికి వచ్చారు. హేమకు గొంతుక వచ్చింది. "ఏమిటీ పిచ్చికేకలు. ఆయన పోనక్కర్లేదు" అంది గట్టిగా. రావు ఆగిపోయాడు. కాని క్షణంలోనే మళ్లీ కోపం ఉబికివచ్చింది. "పొమ్మంటున్నాను పోవలసిందే" అని అరిచాడు. "పోవడానికి వీలులేదు" అంది దృఢంగా హేమ. రావు లెక్చరర్ దగ్గరకు వచ్చాడు. హేమ అడ్డు నిలుచుంది. "నేనే రమ్మన్నాను నా అతిథులకమర్యాద జరిగితే నాకు జరిగినట్లే! నేనది సహించను. లెక్చరర్ గారూ కూర్చోండి" అంది హేమ. ప్లీడర్లలో పెద్దవాడు ముందుకువచ్చాడు. "ఏమిటి రావు ఈగొడవ. ఎందుకు పొమ్మంటున్నావు? ఏం చేశాడని?"

రావు వాళ్ళకేసి చూశాడు. ఆగిపోయాడు. అవును ఎందుకు పొమ్మంటున్నాడు? ఏంచేశాడని? తనకేదో అనుమానం తట్టిందనేగా. కాని ఆ అనుమానం ప్రకటించగలడా? వాళ్ళడిగినదానికి జవాబు చెప్పగలడా. ఇంగ్లీషు లెక్చరర్‌కు ధైర్యం వచ్చింది. "నేనయినా ఈ ఇంటికివచ్చి ఈయనచేత తిట్లు పడడానికి నాకేమవసరం? రేపు మన సొసైటీలో జరపబోయే కార్యక్రమం గురించి చర్చిద్దాం రమ్మని హేమలతగారు పిలిస్తే వచ్చాను. అదే చర్చిస్తున్నాం. (అంతా అబద్ధమనుకున్నాడు రావు. అందరికీ మాత్రం నిజమే ననిపించింది. ఎదుట టీపాయ్‌మీద కార్యక్రమానికి సంబంధించే కాగితాలే ఉన్నాయి.) నేనూ మర్యాదస్థుడినే. నన్ను ఇలా 'ఇన్‌సల్టు' చేసినందుకు తగిన విధంగా చర్యతీసుకుంటాను" అన్నాడు లెక్చరర్

అందరూ జవాబీయ వేమి అన్నట్లు రావుకేసి చూస్తున్నారు. ఏమి జవాబీయగలడు? అందరి కళ్ళలోనూ తాను మూర్ఖుడులా ప్రవర్తించినట్లు తోచింది. అందరి ముందూ తన భార్యే తన నెదిరించింది. తన కవమానం చేసింది. అక్కడ ఉండలేకపోయాడు. వాళ్లను చీల్చుకుంటూ చరచరా బయటికి వెళ్ళిపోయాడు. వెనకాల నవ్వులు వినిపించాయి. తిరిగి వచ్చి, అందరినీ లోపల పెట్టి తాళంవేసి ఇంటికి నిప్పంటించా లనిపించింది రావుకి. కాని అటువంటి దేమీ చేయకముందుకు నడచిపోయాడు.

అలా ఆ కోపంలో ఎక్కడకు పోతున్నానో అనేదికూడా గమనించక ఊరిచుట్టూ మూడుసార్లు తిరిగాడు. అయినా కోపం తగ్గలేదు. ఎవడో కుర్రవాడు గులాబీపూల గంప తీసుకొనివచ్చి "బాబూ ఒక గుత్తి తీసుకోండి బాబూ, బేడ కైదు" అన్నాడు. రావు ఆగిపోయి ఆ పూలకేసి ఆ పూల కుర్రవాడి మొగంకేసి చూసి పావలా ఇచ్చి రెండు గుత్తులు తీసుకొని పార్కులోకి పోయాడు. ఒక మారుమూల చోట కూర్చొని పువ్వులుతీసి చూశాడు. భార్య సౌందర్యం జ్ఞాపకం వచ్చింది. ఒక్కొక్క పువ్వే తీసి రేకలు రేకలుగా చీల్చి, ముక్కలుగా తుంపి వేళ్ళతో నలిపి, కాలిక్రింద పడవేసి అరికాలితో నేల రాచాడు. పూవులన్నీ నేలలో కలిసిపోయాయి. అతని కదోక తృప్తికలిగింది. కోపం కొంత శమించింది. ఇంటికి బయలుదేరాడు.

ఇంకా ఆలోచనలు పీడిస్తూనే ఉన్నాయి. ఒకటి రెండుసార్లు కార్లక్రింద పడిపోబోయాడు. దానితో జాగ్రత్తగా చూసుకుంటూ నడవసాగాడు. రోడ్డుమీద అతి వేగంగా వస్తోంది ఒక కారు. ఒక చిన్న కుర్రవాడు ఆ కారుత్రోవ కడ్డంగా వస్తున్నాడు. తటాలున రెక్క పట్టి లాగివేశాడు రావు ఆ కుర్రవాడిని. కారు రాసుకుంటూ ఆగి మళ్ళీ వెళ్ళిపోయింది. కుర్రవాడు కొద్ది గీరులతో బ్రతికిపోయాడు. రావు ఆ కుర్రవాడిని చూశాడు. ఆరేళ్ళుంటాయి, నల్లగా ఉన్నాడు. ఒక కాలు కుంటి. కుర్రవాడు భయంతో ఏడుస్తున్నాడు. కేకలు విని కుర్రవాడి తల్లిదండ్రులు పరుగెత్తుకు వచ్చారు. కుర్రవాడి ప్రాణం పోయేదే, కొద్దిలో దక్కాడు అని ఆనందంతో వాడిని గుండెల కద్దుకునే బదులు వాడిని చచ్చేటట్లు కొటసాగారు. "కుంటివెధవకి తోడు. ఊరంతా పెత్తనాలే. చావు వెధవని పట్టుకోలేక చస్తున్నాం. కారుక్రిందపడి చచ్చినా బాగుండేది. వదిలిపోయేది పీడ" అంటూ వెన్నుమీద చరుస్తున్నారు. ఆ కుర్రవాడు రావుకేసి దీనంగా చూస్తూ గోలపెడ్తున్నాడు. ఆ కుర్రవాడి బాధ రావుగుండెలోకి చొచ్చుకుపోయింది. వాడూ తనలాగే అనాకారి. నల్లగా ఉన్నాడు కుంటివాడు. తన నెవరూ ప్రేమించనట్లుగానే వాడినీ ఈ లోకంలో ఎవరూ ప్రేమించరు — తల్లిదండ్రులు కూడా. వాడూ పెరిగి పెద్దవాడైతే తనలాగే బాధపడ్తాడు. తనూ వాడూ ఒకే పరిస్థితిలో ఉన్నారు. అందువల్ల వాడిని కొట్టూంటే తనను కొట్టున్నట్లే అనిపించింది రావుకి. "కొట్టకండి, కొట్టకండి" అంటూ ఒకరూపాయి తీసి ఆ కుర్రవాడి చేతిలో పెట్టి మిఠాయి కొనిపెట్టమన్నాడు. వాళ్ళు ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయారు. తనవెంట తీసుకు రమ్మన్నాడు గీరుకుపోయినచోట డాక్టరుచేత మందు వేయిస్తానని. వాళ్లు ఆ కుర్రవాడిని ఎత్తుకొని అతని వెనకాలే డాక్టరు ఇంటికి నడిచారు. డాక్టరు చేత మందు వేయించి వాళ్లనింటికి పంపి ఒక కొత్త అనుభవంతో ఇంటికి మరలాడు రావు.

ఇప్పుడతని హృదయంలో కొత్తపొంగు వస్తోంది. చాలాసార్లు ఆ కుర్రవాడే జ్ఞాపకం వస్తున్నాడు. ఆ కుంటి కుర్రవాడూ, తనూ ఈ ఇద్దరే లోకంలో ఒక జాతికి చెందినవారనిపించింది రావుకి. ఇంకా ఎందరో తములాటివాళ్లు ఉంటే ఉండవచ్చు. కాని వాళ్ళ నెరగడు రావు. అతనికి ఆ కుంటికుర్రవాడొక్కడే సన్నిహితుడు. వాడంటే అదో ప్రేమ కలుగసాగింది. రోజూ అతను ఆఫీసుకు వెళ్లే వేళకు ఆ కుర్రవాడి బడి విడిచిపెట్తారు. ఆ దారినే వస్తాడు వాడు. ఆ కుంటివాడిని చూసి మిగతా పిల్లలందరూ ఏడిపిస్తున్నారు. ఏడుస్తూ వస్తూ రావును చూడగానే అంత ఏడుపులోనూ చిరునవ్వు తెచ్చుకొని రావుదగ్గరకు పరుగెత్తుకు వచ్చి పలకరించి వెళ్తున్నాడు. సాయంత్రం రావు ఆఫీసు విడిచేవేళ, ఆ కుర్రవాడి బడి విడిచేవేళ ఒక్కటే కావడంవల్ల ఆ కుర్రవాడు రావుతోకూడా కొంతదూరం నడుస్తున్నాడు. రావును చూసి మిగతా పిల్లలు ఆ కుంటివాడి జోలికి పోలేకపోతున్నారు. కుర్రవాడు ఏవేవో కబుర్లు చెప్పుతూ వస్తున్నాడు. అవి అత్యంత శ్రద్ధతో వింటున్నాడు రావు. ఆ అమాయకపు మాటలు వింటూంటే ఏదో అవ్యక్తానందంతో నిండిపోతోంది రావు హృదయం. జనానికి ఆ కుర్రవాడు కుంటివాడని మాత్రమే తెలుసు. అందుకే వాళ్లు వాడిని ప్రేమించలేరు. అందుకే పిల్లలందరూ ఏడిపిస్తారు. కాని ఆకుర్రవాడికి హృదయముందని తన కొక్కడికే తెలుసు. తనకు

హృదయముందని ఆ కుర్రవాడొక్కడికే తెలుసు. అందువల్లే ఇద్దరి మధ్యా ఈ స్నేహం. ఆ కుర్రవాడిని చూస్తూంటే వాడు తన కొడుకైయుంటే బాగుండు ననిపించింది రావుకి. ఆ అభిప్రాయం కలిగినప్పటి నుంచీ అతని గుండె నిరిగి ప్రేమతో నిండిపోసాగింది. ఇన్నాళ్లూ బయటికి పోవడానికి అవకాశంలేక నిలిచిపోయిన ప్రేమంతా ఒక్కమారుగా ఆ కుర్రవాడి మీదకు మళ్ళింది. పూర్తిగా మళ్ళింది. ఆ కుర్రవాడిని తల్లికన్న ఎక్కువ ప్రేమతో చూడసాగాడు రావు. ఒక సాయంత్రం వాడిని వెంటబెట్టుకొని బజారుకు వెళ్ళి వాడికి చొక్కాలకూ లాగులకూ గుడ్డలు చింపించి దర్జీకిచ్చి, బిస్కట్లపొట్లాలూ, బొమ్మలూ, పుస్తకాలూ కొని పార్కుకు బయలుదేరాడు. కుర్రవాడిని ఒకచోట కూర్చోమని తాను ప్రక్కనే కూర్చున్నాడు. ఆ కుర్రవాడు బొమ్మలతో ఆడుతూంటే తన్ను తాను మరచిపోయి, వాడితో సమానంగా ఆనందం పంచుకుంటున్నాడు. ఒకనాడు పెద్ద ధనవంతుడుగా పేరుబడ్డ పెద్దమనిషి కొడుకు ఇలా పూరిగుడిసెల్లోని పిల్లవాడితో తిరుగుతున్నాడంటే లోకం విడ్డూరంగా చెప్పుకోసాగింది. చెప్పుకోనీ యనుకున్నాడు రావు. చెప్పుకుంటేనే బాగుంటుం దనుకున్నాడు. లోకం కూడదన్న పనే చేయాలనీ, లోకాన్ని ధిక్కరించాలనీ అతని మనస్సు తహతహలాడుతున్నది.

ఆ ఊరు సర్కసు వచ్చింది. జనం విరగబడి చూస్తున్నారు. రావుకుమాత్రం చూడాలనిపించలేదు. కాని కుర్రవాడు సర్కసులో ఏనుగులు పెద్దపెద్దవిగా ఉంటాయిగదూ, పెద్దపుల్లు గాండ్రు గాండ్రుమంటాయి కాదూ అని పదేపదే అంటూంటే ఆవేళ సాయంత్రం కుర్రవాడిని తీసుకొని సర్కసుకు బయలుదేరాడు. ఫస్టు క్లాసుకు టికెట్లు తీసుకొనిపోయి కుర్రవాడి నొక కుర్చీలో కూర్చోబెట్టి పక్కకుర్చీలో తను కూర్చున్నాడు. వాళ్లను చూసి ప్రక్కవాళ్ళు కంగారుగా లేచి దూరంగా తప్పుకున్నారు. ఒకరిద్దరు అప్పుడే వచ్చినవాళ్ళు కుర్చీలు ఖాళీగా ఉన్నాయికదా అని అటు వచ్చి, వాళ్లను చూసి బెదరిపోయి వెనక్కి పరుగెత్తుతున్నారు. వాళ్ళ కంగారు చూసి రావు నవ్వుకున్నాడు. సర్కసు ప్రారంభమైంది. ఫీట్స్ చూస్తూ కుర్రవాడు ఆనందం పట్టలేక చప్పట్లు చరిచి కేరింతాలు కొట్టున్నాడు. వాడి కేరింతాలు చూచి రావు కూడా కుర్రవాడైపోతున్నాడు.

రావు హృదయంలో ఇప్పుడు హేమ అంటే ప్రేమ ఇగిరిపోయింది. కామం కూడా నశించింది. ఉన్నదల్లా ఒక్క ప్రతీకారవాంఛే. ఒకటే ద్వేషం. ప్రతీకారం ఎలా సాగించుకోగలనా, ఎప్పుడు అవకాశం లభిస్తుందా అని చూస్తున్నాడు. కాని అతని ప్రతీకారవాంఛలో మొదట ఉండిన పదును లేదు ఇప్పుడు. తాను తలపెట్టినది చేయాలంటే హృదయమంతా పూర్తిగా విషమయమైపోవాలి. రాయితో సమానమైపోవాలి. కాని అతనిహృదయంలో హేమపట్ల విషంతోనిండినా, ఒకనైపు ఆ కుంటి కుర్రవాడంటే ప్రేమతో నిండిపోతోంది. అంగువల్ల తాను తలపెట్టినది చేయడానికి కావలసిన రాతిగుండెలే దతనికి. మరి వేరేవిధంగా ప్రతీకారం చేయాలని చూడసాగాడు.

కాలేజీలో చదువుతున్నరోజుల్లో రావు రాసిన రెండుకథలూ, ఒకటి రెండు వ్యాసాలూ పత్రికలలో పడ్డాయి బాగా రాశాడన్నారు అందరూ. కాని అతను మళ్ళీ అటు కృషి చేయలేదు. ఇప్పుడు ఆ రచనాశక్తి నుపయోగించి హేమనూ, ఆమె సమాజాన్ని మట్టిలో కీడ్వాలని సంకల్పించుకున్నాడు. కాగితం, కలం తీసుకున్నాడు. ఎన్నో విషయాలు ఒక్కసారిగా అతని మనస్సులో నిండిపోయాయి. అన్నిటినీ తీర్చి పెట్టుకున్నాడు. ఎలా ఎంతఘాటుగా రాయాలో ఊహించుకున్నాడు. కలం కాగితంమీద పెట్టబోతున్నాడు. ఇంతలో పేపర్లకుర్రవాడువచ్చి ఆఊళ్లోనే వెలువడే ఒక పత్రిక అతనికిచ్చి వెళ్ళిపోయాడు. పత్రికవిప్పి చూశాడు. మొదటిపేజీలోనే పెద్దక్షరాలతో "నేటి సమాజం" అనే వ్యాసం మారు పేరు పెట్టుకున్న రచయిత దెవరిదో ప్రకటించబడింది. చాలా పెద్దవ్యాసమే. నాలుగు పేజీలు పూర్తిగా ఉంది. చదవసాగాడు రావు. అరే! ఇదేమిటి, ఎవరు? తను రాయదలచుకున్నదే రాసివేశాడే! హేమనుగురించీ, ఆమె స్నేహితులనుగురించీ తీవ్రమైన దూషణతో నిండిఉంది. త్వరత్వరగా చదివేశాడు రావు వ్యాసం; మళ్ళీ చదివాడు; మళ్ళీ చదివాడు; ఆ రచయిత ఎవడో కనిపిస్తే బాగుండును కౌగలించుకునే వాడే! సంతోషం పట్టలేక గదిలో అటూ ఇటూ తిరగసాగాడు. మళ్ళీ వ్యాసం తీసుకు చదివాడు. ఎవరు రాసిఉంటారు? అందులో హేమ మిత్రులందరి మీదా—ఒక్క కళాకారుడిమీద తప్పితే—ఆరోపణలున్నాయి. అదీ, ఆ కళాకారుడే రాసిఉంటాడు. అతనే! అనుమానంలేదు. అతను తరుచు వాడే రెండు

మారు ఊతపదాలు వ్యాసంలో కూడా దొర్లాయి. కొన్ని రోజులనుంచి అతను తన భార్యదగ్గర కనబడటం లేదు కూడా. ఏదో వచ్చిందన్న మాట! ఏదో ఆశించి ఉంటాడు. ఆశ ఫలించకపోగా నిస్పృహతో ఎదురు తిరిగి ఇలా వ్రాసి ఉంటాడు. ఈ ఆలోచన తోచగానే రావుకు కళాకారుడిమీద అసహ్యం పుట్టుకు వచ్చింది. కళాకారుడు తన కొకనాడు శత్రువే తన భార్యవెంటబడ్డవాడే. ఇప్పుడు అనుకున్నది కాకపోగా తను కోరినవారికే ద్రోహం తలపెట్టాడు నీచుడు. కళాకారుడి బండారం బయటపెట్టాలనీ, అతనికి తగినశాస్తి చేయాలనీ రావుకు గొప్ప ఉబలాటం కలగసాగింది. అలా కళాకారుడికి జవాబీయడంలో తన భార్యను సమర్థించవలసి వస్తుంది. సమర్థించినా సరే. అసలు తనవస్తువును అని ఎంత నీచమైనవస్తువైనా, ఇంకొకడు అపఖ్యాతి పాలు చేస్తున్నాడంటే ఆ వస్తువును కాపాడాలనే బుద్ధిపుట్టిం దతనికి. వెంటనే కలంతీసి కాగితంమీద తా నిదివరకు ఏమిరాద్దామనుకున్నాడో సరిగా దానికి వ్యతిరేకంగా కళాకారుడిమీద "పుల్ల దాతు పళ్లు" అనే పేరుతో వ్యాసం ప్రారంభించాడు. తన పేరు "సుందర్ కుమార్" అని పెట్టుకున్నాడు. కళాకారుణ్ణి ఖండించటానికిగాను భార్యను సమర్థించడంలో అనుకోకుండానే చాలా దూరం పోయాడు. అతనికే ఆశ్చర్యం వేసింది ఆమెనంతగా సమర్థించినందుకు. నవ్వుకున్నాడు. ఈ వ్యాసంచూసి భార్య ఎలా ప్రవర్తిస్తుందో గమనించాలన్న కుతూహలం బయలుదేరింది. వ్యాసం ఆ ఊళ్లో ఉన్న రెండో పత్రికకు తన పేరూ విలాసమూ ఈయకుండా పంపించాడు.

మొదటి పత్రికలోని 'నేటి సమాజం' అనే వ్యాసంతో ఊరంతా గగ్గోలుగా ఉంది. ఎక్కడ చూసినా దానిమీద చర్చ. హేమకు ప్రపంచమంతా తనమీదకే విరుచుకుపడ్డట్లనిపించింది. ధైర్యం చెడిపోయింది. ఎన్నడూ ఇటువంటిది జరుగుతుందని ఆమె ఊహించలేదు. ఆమె కేమీ తోచడంలేదు. ఎలా ఈ భయంకర పరిస్థితినుంచి బయటపడడమో ఆందోళన చెందిపోతోంది. మర్నాడు రెండవ పత్రికలో "పుల్ల దాతుపళ్లు" అనే వ్యాసం చూసింది. కొంత ధైర్యం తిరిగి వచ్చిందామెకు. జవాబు ఎవరు రాసి ఉంటారా అని ఆలోచించింది. "నేటి సమాజం" వ్యాసం మొదట్లో తన భర్తే రాశాడేమోనని అనుమాన పడింది. కాని కళాకారుడే రాశాడని తెలుసుకోడానికి ఆట్టేసేపు పట్టలేదు. కళాకారుడు శత్రువైపోయాడు. ఇక మిగిలిన మిత్రబృందంలో ఇద్దరు లెక్చరర్లే ఏమైనా వ్రాయగలిగేది. అందులో ఎవరు వ్రాసి ఉంటారో నిర్ధారణ చేసుకోలేకపోయింది. అందువల్ల, పైకి కృతజ్ఞత స్పష్టంగా ప్రకటించలేకపోయినా, ఇద్దరినీ ఇదివరకటికన్న గౌరవంగా చూడసాగింది. అయినా హేమ ఇదివరకులా స్వేచ్ఛగా తిరగలేకపోతోంది. పార్టీలు అవీ తగ్గించుకుంది. మిత్రులతో కూడా ఇదివరకటంతటి చనువుగా ఉండలేకపోతోంది.

రావు ఎక్కువకాలం ఆ కుర్రవాడితోనే కాలక్షేపం చేస్తున్నాడు. మొదటవాడిని ముట్టుకోడానికి సంశయించినా ఇప్పుడు వాడిని అప్పుడప్పుడు ఎత్తుకొని కూడా తిరుగుతున్నాడు—లోకం బాగా చూడాలనే. కుర్రవాడిని ఎత్తుకునే ఇంటికి వచ్చాడు. హాలులో హేమా, స్నేహితురాండ్రూ, లెక్చరరూ, డాక్టరూ, ప్లీడర్లూ కూర్చొని ఉన్నారు. అతను లోపలికి పోయాడు. అతన్ని చూసి అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. కుర్రవాడితో ఇంటి లోపలిభాగానికి పోబోతున్నాడు రావు. "ఎక్కడికీ" అని అడిగింది హేమ. "ఇంట్లోకి" అన్నాడు మెల్లగా భీషణంగా. "తీసుకువెళ్ళడానికి వీలు లేదం"ది ఆమె. రావు కుర్రవాడిని ఒకకుర్చీలో కూర్చోబెట్టాడు. వాళ్లవైపుకు తిరిగాడు. పళ్ళు బిగించి, అతి మెల్లగానే "ముందు మీ రిక్కడనుంచి బయటికి నడవండి" అన్నాడు. వాళ్లు భయంతో నిలబడిపోయారు. "వెళ్ళరు" అంది హేమ ఎదిరించి. "నా యింట్లోనుంచి పోవలసిందే" అన్నాడు రావు గొంతుక ఏమాత్రం పెంచకుండానే. "మీ యిల్లు కాదు, మా నాన్న ఇల్లు" అంది హేమ. ఒక క్షణం ఆగిపోయాడు రావు. మళ్ళీ "అయినా సరే, నే నుండగా వీళ్ళిక్కడ ఉండడానికి వీలు లేద"న్నాడు. వాళ్లవైపుకు అడుగులు వేస్తూ "నేను జెయిలుకు పోవచ్చు. కాని పోయే ముందు మీ శరీరాల్లో ఒక్క ఎముక కూడా సరిగా ఉండకుండా చూసి మరీ వెళ్తా"నన్నాడు. ఆ మెల్లగా అనడంలోనే భీషణత్వం కనిపిస్తోంది. వాళ్ళు కంగారుగా ఒకరినొకరు తోసుకుంటూ బయటకు పరుగెత్తి ఇళ్ళకు వెళ్ళిపోయారు." హేమ మాట్లాడలేక ఉండిపోయింది. ఆమెకు కూడా ఎందుకో ఈ వేళ రావును చూస్తే భయం కలిగింది. రావు కుర్రవాడిని తీసుకొని లోపలికి వెళ్లాడు. మరికొంతసేపటికి ఇవతలకువచ్చి ఒక బండిని కేక వేశాడు. బండివాడిని లోపలకు తీసుకువెళ్లి తన సామానులన్నీ తెప్పించి బండిలో పెట్టించాడు. కుర్రవాడిని బండిలో కూర్చోబెట్టి,

ప్రక్కన తను కూర్చొని బండిని పేదపేటలవైపుకు పోనిమ్మన్నాడు.

అతని నిప్పుడొక కొత్త సమస్య ఎదుర్కొంది. అతని ఉద్యోగం ఊడిపోయింది. తిండికే తిప్పలు పడే పరిస్థితి ఏర్పడింది. కూలిచేసుకునే జీవితం గడపాలని నిశ్చయించుకున్నాడు. ఒకనాటి ధనవంతుని కొడుకే కూలిచేసుకు బ్రతకడం. లోకం నవ్వుతుంది. దానిపని అంతే. తాను కూలిచేసుకునే బ్రతుకుతాడు. కాని కూలిపని ఎక్కడ దొరకుతుంది. ఇంతలోనే కుర్రవాడికి జ్వరం రాసాగింది. గవర్నమెంటు ఆసుపత్రిలో ప్రవేశపెట్టించాడు. కుర్రవాడికి దగ్గూ, ఆయాసమూ కూడా రాసాగాయి. న్యుమోనియా అని తేలింది. కుర్రవాడికి ఊపిరందడం కష్టంగా ఉంది. నిస్సహాయంగా మాటలులేక కన్నీళ్ళు విడుస్తూ బెదురుగా చూస్తున్నాడు వాడు. వాడిని చూస్తూంటే తనకే ఊపిరాడనట్లనిపించింది రావుకి. కుర్రవాడి పరిస్థితి నానాటికి తీసికట్టుగా ఉంది. రావు ఊళ్ళోకి వెళ్ళి అప్పుడే వస్తున్నాడు. అప్పుడే కుర్రవాడు ఒకమారు కళ్ళు తెరచి తల్లితో అన్నాడు "అమ్మా నే వెళ్ళిపోతున్నాను. బాబయ్యను రమ్మను" అని కళ్ళుమూశాడు. రావు ఆ మాటలు విన్నాడు. లోపలికి వచ్చేసరికి ఆ పిల్లవాడి ప్రాణం పోనేపోయింది. రావు కొంతసేపు స్తబ్ధుడై కూర్చున్నాడు. కొంతసేపటికి లేచి తన గదికి వెళ్ళిపోయాడు. ఆ కుంటి కుర్రవాణ్ణి బ్రతకకుండా చేసింది ప్రపంచం. అసలు దేవుడికే తామంటే ప్రేమలేదు. కుర్రవాడు చచ్చిపోవడంతో అతని ప్రాణమే పోయినట్లనిపించింది రావుకు. ఉత్తశరీరమే అన్నట్లుంది. తనకీ లోకంలో స్థానం లేదు. చచ్చి దేవుడిని అడుగుతాడు తన కెందుకింత అన్యాయం చేశాడో!

రావుకు అకస్మాత్తుగా హేమ గుర్తుకువచ్చింది. అతనిలోని ప్రతీకార వాంఛ ఒక్కసారిగా పెల్లుబికింది. ఆమెను శిక్షించి కాని తాను చావకూడదు. ఇప్పుడు హృదయం పూర్తిగా విషమయమై పోయింది. ఇక సంకోచం లేకుండా ఏపనైనా చేయగలడు. ఆమెను బాధించి, బాధించి చంపాలనే కోరిక బయలుదేరింది. రాత్రి ట్రంకులోనుంచి రెండు పిస్తోళ్ళు తీశాడు. గుండ్లతో నింపాడు. బాగా పొద్దుపోయిన తర్వాత హేమ ఇంటికి వెళ్ళాడు. గారేజీ తాళం తన దగ్గరనున్న చేతో తీసి కారు బయటికి తీసుకువచ్చి గేటుదగ్గర పెట్టాడు. మెల్లిగా తలుపు తట్టాడు. హేమే తెరచింది. అతన్ని చూసి ఆశ్చర్యపోయింది. అతను లోపలికి నడిచాడు. దాసీది పక్కగదిలో ఉండడం చూసి ఇంకొక ప్రక్కకు నడిచి హేమను రమ్మన్నాడు. ఆమె రాలేదు. దగ్గరకువచ్చి పిస్తోలు పైకితీసి ఆమె గుండెకు గురిచేశాడు. ఆమెకు భయంతో మాటకూడా పైకిరాలేదు. అతను చటుక్కున చేయి ఆమెమీదనుంచి చుట్టవేసి నోరు నొక్కివేశాడు. జేబురుమాళ్ళు నోట్లో కుక్కాడు. చేతులూ, కాళ్ళూ కట్టివేశాడు. తీసుకువెళ్ళి బయట జాగ్రత్తగా చూసి కారులో వెనకసీటుముందు క్రిందనే ఉంచాడు. ఒక గుడ్డ ఆమెమీద కప్పాడు. ఇంటికి బయట గొళ్ళెం పెట్టి, కారు పోనిచ్చాడు.

మొట్టమొదట డాక్టరింటికి పోయాడు. తలుపు తట్టాడు. ఏదో కేసేమోనని డాక్టరువచ్చి తలుపు తీశాడు. డొక్కలో పిస్తోలు గుచ్చుకుంది "అరవకు. అరిచావంటే చచ్చావన్నమాటే. నిన్నేమీ చేయను. ఒట్టువేస్తున్నాను నాతోరా. కొద్దిగా మాట్లాడవలసి వుంది మాట్లాడి మళ్ళీ తీసుకువచ్చి దిగబెడుతాను. ఏమీ భయంలేదు. కాని ఏమైనా అల్లరిచేశావో ప్రాణం పోయినట్లే!"

డాక్టరు అతను చెప్పినట్టే నడిచాడు. కారు ఫ్రంటు సీటులో కూర్చోబెట్టుకొని ఊరిబయటకు పోనిచ్చాడు రావు అక్కడ ఆపాడు. రావు డాక్టర్ని అడిగాడు.

"నీవు నా భార్యను ప్రేమిస్తున్నావు కదూ?"

డాక్టరు మాట్లాడలేకపోయాడు.

"నీవు ఎన్నడూ పెళ్ళి చేసుకోనని ఒట్టు వేయగలవా?"

డాక్టరుకు కొద్దిగా మాట వచ్చింది. "నేను పెళ్ళిచేసుకోకుండా ఉండలేను. మావాళ్ళంతా బలవంత పెట్టారు."

"అయితే నీ విప్పుడు నా భార్యతో ప్రవర్తించినట్లు నేను నీ భార్యతో ప్రవర్తించడానికి ఒప్పుకుంటావా?"

డాక్టరుకు ముచ్చెమటలు పోశాయి. "క్షమించండి రావుగారూ, నాకు బుద్ధివచ్చింది. ఇంక ఎన్నడూ ఇట్టె పనులు చేయను"

"నిన్ను చంపివేస్తే మాత్రం తప్పేమిటి?"

"రక్షించండి రావుగారూ! కాళ్ళు పట్టుకుంటాను. కాపాడండి."

రావు వచ్చాడు. అతనిచేత అప్పుడు జరిగినదేదీ ఎవరికీ చెప్పనని ఒట్టు వేయించి, అతన్ని ఇంటికి తీసుకుపోయి దిగబెట్టాడు. తరువాత ఇంగ్లీషు లెక్చరర్ ఇంటికి పోయాడు. ఇంగ్లీషు లెక్చరర్ మొదటే బేజారైపోయి, అతను అడక్కుండానే అన్నీ ఒప్పుకొని, ప్రతిమాలి ప్రాణాలు దక్కించుకున్నాడు. హిస్టరీ లెక్చరర్ మొదట బెట్టు చూపబోయాడు కాని సాగక కాళ్లు పట్టుకున్నాడు. ప్లీడర దగ్గరకు పోలేదు రావు. హిస్టరీ లెక్చరర్ని విడిచిపెట్టి కారు తిన్నగా ఊరి బయటకు పోనిచ్చాడు.

ఆకాశమంతా కారుమబ్బులు క్రమ్మి మరీ అంధకారంగా ఉంది. పెనుగాలి వీస్తోంది. భయంకరమైన మూలుగు ధ్వనితో పెనుభూతాల్లాగా తల లూపుతున్నాయి చెట్లన్నీ. పది మైళ్లు పోయినతర్వాత కారు ఆపాడు. వెనక సీటుకు పోయి భార్యను ఇవతలికి తీశాడు. కట్లు విప్పాడు. నోట్లో రుమాళ్ళు తీసివేశాడు. ఆమె మూర్ఛపోయిఉంది. కారులోని కాన్లో నీళ్ళు తెచ్చి చల్లాడు. ఆమెకు స్మృతి వచ్చింది. రావు బాటరీలైటు తీసి, ఒక కాగితం కలం ఆమెముందు పడవేసి, లైటు కాగితంమీదకు ఫోకసు చేసి, "ఏమైనా ఎవరితోనైనా చెప్పవలసి ఉంటే ఆ కాగితంమీద వ్రాయి. ఇదే నీకూ నాకూ ఆఖరి గడియ" అన్నాడు. ఆమె చేతిలో కాగితం గాలిలోకి ఎగిరిపోయింది. ఆమెలోనుంచి ఏడుపు బయలుదేరింది. అతి దీనంగా ఏడుస్తోంది. అప్పుడతనికి కనిపించిన రూపం చూసి అతనికి అసహ్యం కలిగింది. ఇప్పుడామె సౌందర్యమూర్తి కాదు. పిటికిపీనుగు. అటువంటిదాన్ని చంపడానికి అసహ్యం వేసింది. కారులోకి ఎక్కపోయాడు. కారు తిరుగుదారిని పట్టించాడు. కుంభవృష్టిగా వర్షం కురవసాగింది. గాలికి చెట్లు కూలుతున్నాయి. అలాగే సాగుతోంది కారు. హఠాత్తుగా, ఫెళఫెళారావంతో పెద్ద చెట్టు వాలి కారుకు ముందుగా పడింది. కారు ముందుభాగమంతా పిప్పి అయిపోయింది. రావు చటుక్కున బయటకు దూకివేశాడు. ఆమెనూ బయటకు లాగాడు. ఆమెను అలానే విడిచిపెట్టి పోబోయాడు. ఆమె భయంతో పరుగెత్తుకువచ్చి అతనిని చుట్టుకుంది. వదిలించుకొన్నాడు. మళ్ళీ పరుగెత్తుకువచ్చి పట్టుకుంది. గట్టిగా విదిలించుకొని వెనక్కి తోసేశాడు రావు. ఆమె చెట్టుమీద పడి అలాగే నేలకు ఒరిగిపోయింది. అతను గాలివర్షంలో కొంచెం ముందుకు సాగాడు. ఒకసారి వెనక్కి చూశాడు. ఆమె అలా నేలమీద పడిఉండడం చూశాడు. వెనక్కి తిరిగివచ్చి ఆమెను ఎత్తుకొని భుజంమీద వేసుకున్నాడు. ముందుకు నడిచాడు. దారి కనబడడం లేదు. అలానే పడిపోయిన చెట్లను తప్పించుకుంటూ మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నాడు. ఇద్దరూ పూర్తిగా నానిపోతున్నారు. ఆమె గజగజ వణుకుతూ మూలుగుతోంది. ఊరు మైలుదూరంలోకి వచ్చింది. ఇక ఫరవాలేదనుకున్నాడు. కాని కాళ్లు నీళ్లలో దిగుతున్నాయి. అంతకంతకు నీరు పైకి వస్తూంది, వాగు పొంగింది కాబోలు. అందడం లేదు. ప్రవాహం అతివేగంగా ఉంది. ఆమెను వెన్నుమీదకు మార్చుకున్నాడు. కదలవద్దు అని చెప్పి ఈదసాగాడు. క్రిందికి కొట్టుకుపోతున్నాడు, పైన బరువు, ఈదడం కష్టమైపోతోంది. ఇంతలో నేల తగిలింది. ఒడ్డుకు చేరాడు మళ్ళీ ఆమెను భుజంమీదకు మార్చుకున్నాడు. ఊళ్లో ప్రవేశించాడు. ఊళ్లో ఎక్కడా లైట్లు వెలగడం లేదు. కారుచీకటి. అలానే తడుముకుంటూ ఆమెను ఇంటికి తీసుకువెళ్లాడు. గొళ్లెంతీసి లోపలకు తీసుకుపోయి మంచంమీద దించాడు.

మెల్లగా వెనక్కి తిరిగాడు.

"ఎక్కడికి" అంది హేమ ఆదుర్దాగా.

"ఎక్కడికైతేనేం" అన్నాడు రావు నిర్లక్ష్యంగా.

"కాదు. పోకండి. నన్ను విడిచిపెటకండి. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నా"నంది ఆవేశంతో.

"లాభం లేదు—సమయం మించిపోయింది" అంటూ నిర్వికారంగా ఒకనవ్వు నవ్వి, బయటకు అలానే ఆ తుఫానులోకి వెళ్ళిపోయాడు. ఎక్కడికో! ఎందుకో!